అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 20 మార్చి 2023

నేడు మండల సర్వసభ్య సమావేశం...
నవతెలంగాణ-నార్నూర్

మండలకేంద్రంలోనీ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన సర్వసభ్య నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కావల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికతో హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశానికి సకాలంలో ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పంట నష్టం అంచనా

బోథ్ : ఇటీవల వడగండ్లతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆదివారం వ్యవసాయాధికారులు జి.శ్రీధర్ స్వామి, ఎఓ విశ్వమిత్రలు పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్టు పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్న, నువ్వులు, శనగ, గోధుమ, పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ వాజిద్, రైతులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల కవాతు

ముధోల్ : శాంతి భద్రతల పరిరక్షణకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కవాతు నిర్వహించామని ముధోల్ సీఐ వినోద్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే చౌక్ నుండి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు సాగింది. కవాతులో దాదాపు 100 మంది ర్యాపిడ్ యాక్షన్ బలగాల సిబ్బంది పాల్గొన్నారు. వజ్రా వాహనం వెనుకాల బలగాలు అత్యాధునిక ఆయుధాలతో కవాతు ముందుకు సాగింది. కవాతు అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని తెలిపారు. శాంతి భద్రతల్లో భాగంగా ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసుల సేవలను ప్రజలు వినయోగించుకోవాలని సూచించారు. అనునిత్యం పోలీసులు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రజలు శాంతి భద్రతల రక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, తానూర్ ఎస్సై విక్రమ్, ఏఎస్సై సుదర్శన్ బౌద్ధ, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కడగండ్లు మిగిల్చిన వడగండ్ల వాన..!

- వర్షం దాటికి తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- నిండా మునిగిన మిర్చి, నేలవాలిన మొక్కజొన్న
- అన్నదాతలకు అపారనష్టం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కోటపల్లి, బోథ్

ఉమ్మడి జిల్లాలో కురిసిన వడగండ్ల వాన అన్నదాతలకు కడగండ్లు మిగిల్చింది. అకస్మాత్తుగా వచ్చిన ఈ భారీ వర్షం పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. అనేక చోట్ల రాళ్ల వర్షం కురవడంతో దాని దాటికి తట్టుకోలేక పంటలన్ని నేలవాలాయి. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చింది. వేలాది ఎకరాల్లో పంట నష్టం జరగడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే నష్టాలను మూటగట్టుకున్న రైతులు తాజా వర్షాల కారణంగా మరింత నష్టపోవాల్సి వచ్చింది. పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం, మిర్చి పంట కూడా తడిసిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు కనీసం పంట నష్టాన్ని అంచనా వేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో అకాల వర్షం



పడటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం రాత్రి పలుచగా పడిన చినుకులు శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో చెన్నూర్, కోటపల్లి, బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ తదితర మండలాల్లో పచ్చని పంటలు వర్షార్పణమయ్యాయి. మిర్చి పంటను కల్లాల్లో ఆరబెట్టడంతో వందలాది క్వింటాళ్ల పంట వర్షానికి తడిసిముద్దయింది. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తాయని ముందుగానే



హెచ్చరికలు రావడంతో మిర్చి రైతులు అప్రమత్తమయ్యారు.కళ్లలో ఆరబెట్టిన మిర్చిని రాశులుగా పోసి పైన బర్కం కప్పి వర్షానికి తడవకుండా సంరక్షణ చర్యలు చేపట్టారు.కానీ ఈదురు గాలులకు కప్పిన బార్కములు ఎగిరి పోవడంతో పంటను కాపాడుకోలేకపోయారు. రాత్రి సమయంలో భారీ వర్షం కురవడంతో మిర్చి తడిసిపోయింది. వీటితో పాటు మొక్కజొన్న, జొన్న, గోదుమ తదితర పంటలు నేలవాలాయి. పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు తీరుతాయని ఆశపడ్డాను



గంట శేఖర్, జనగామ, కోటపల్లి మండలం

ఈ సంవత్సరం మిర్చి పంటకు గిట్టుబాటు ధర ఆశించిన స్థాయిలో ఉండటంతో అప్పులు అన్ని తీరుతాయని సంతోషంగా ఉన్నా. కానీ అకాల వర్షం ధాటికి ఆశలు అడియాశలయ్యాయి. రూ.వేలల్లో పెట్టిన పెట్టుబడి మీద పడే పరిస్థితి వచ్చింది. పంటను చీడ పీడల నుండి చెమటోడ్చి కాపాడినా కానీ అకాల వర్షం కన్నీటిని మిగిల్చింది. మూడు ఎకరాల్లో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకున్న ధర ఉండటంతో అప్పుల నుండి బయట పడతాము అనుకున్నాం. కానీ 30 క్వింటాళ్ల మిర్చి తడిసిపోయింది.

పంటంతా నేలవాలింది



వాగ్మారే అశోక్, ఘన్‌పూర్, బోథ్ మండలం

మూడు ఎకరాల్లో గోదుమ, మొక్క జొన్న పంటలు వేశాను. పంట ఎదిగిన దశలో వడగండ్ల వర్షం రావడంతో పంటంతా నేలవాలింది. పంటంతా దెబ్బతినడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం, అధికారులు దృష్టిసారించి పంటల సర్వే చేయించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

మిర్చి మొత్తం తడిసి ముద్దైంది



చెన్నూరి సమ్మయ్య, చెన్నూర్

వర్షానికి తడవకుండా ముందు జాగ్రత్తగా మిర్చిని రాశులుగా పోసి పైన బార్కం కప్పినము. కానీ ఈదురు గాలులతో వర్షం రావడంతో బర్కం గాలికి లేచిపోయి మిర్చి మొత్తం తడిసి ముద్దైంది. తడిచిన మిర్చి రంగు మారుద్దేమో అని ఆందోళన కలుగుతుంది. పెట్టుబడులకు తగ్గట్టు పంట పండిన వర్షం నష్టం మిగిల్చింది.

అటవీ సంపదపై గిరిజనులకే హక్కు

- పోడు పట్టాల జారీలోనూ తీవ్ర నిర్లక్ష్యం
- జిల్లాలో ఎక్కడా మిషన్ భగీరథ నీరు రావడం లేదు
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- స్థానిక ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అటవీ సంపదపై గిరిజనులకే పూర్తి హక్కులుంటాయని చెట్టు, పుట్ట సంపద అంతా వారిదేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం పోడు పట్టాలు జారీ చేస్తుందని గిరిజనులు ఆశపడ్డారని కానీ వాటిని పంపిణీ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తోందని మండిపడ్డారు. హథ్‌సే హాథ్ జోడో యాత్రకు కొనసాగింపుగా పీపుల్స్ మార్చ్ పేరిట చేపట్టిన పాదయాత్ర ఇంద్రవెల్లి మండలంలో కొనసాగుతోంది. ఆదివారం ఉట్నూర్ మండలంలోని కుమ్మరి తాండ వద్ద భట్టి విలేకరులతో మాట్లాడారు. కుప్టి ప్రాజెక్టు నిర్మించాలనే జిల్లా ప్రజల ఆకాంక్ష దశాబ్దాలుగా నెరవేరడం లేదని తెలిపారు. జిల్లాలో ఎక్కడా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని దస్నాపూర్ గ్రామంలో తానే ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. ఇప్పటికీ అక్కడ బావిలోంచి నీళ్లు తీసుకెళు న్నారని ట్యాంకులు నిర్మించినా నిరూపయోగంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ అతి పెద్ద స్కాం అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అడవుల్లోంచి గిరిజనులను బలవంతంగా వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తోందని కనీసం కట్టెలు, మట్టి కోసం కూడా రానీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కమీషన్ లేనిదే ఏ కార్యక్రమం చేయడం లేదని ఆరోపించారు. ఈ



విషయం ఓ సర్పంచ్ కూడా తన దృష్టికి తీసుకొచ్చారని వివరించారు. ఉట్నూర్‌లో మినీ ట్యాంకుబండ్ నిర్మాణం చేపట్టలేదని పీహెచ్‌సీల్లో వైద్యులు లేరని ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు అండగా ఉంటుందని ప్రజా పోరాటాలను చట్టాలుగా మార్చి వారికి ఫలాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉట్నూర్ వరకు తన పాదయాత్రను కొనసాగించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గంద్రత్ సుజాత, జెడ్పీటీసీ సభ్యురాలు చారులత రాథోడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, నాయకులు భరత్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ-బోథ్

మండలంలోని శనివారం కురిసిన వడగండ్ల వానతో పంట నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బురుగు మల్లేష్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. అసలే అతివృష్టి, అనావృష్టి వలన పెట్టిన పెట్టుబడికి దిగుబడి రాక రైతులు నష్టపోయి ఉంటే, రబీ సీజన్‌లో చేతికొచ్చిన పంట నష్టాల పాలవుతుందని అన్నారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆదివారం మండలంలోని ధన్నూర్ (బి)తో పాటు ఆయా గ్రామాలలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులకు పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ నాయకులు వన్నెల అశోక్, లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల అందజేత
నవతెలంగాణ-గుడిహత్నూర్

అదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నివాసంలో ఆదివారం 11 మంది లబ్దిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులైనా కేంద్రే చంద్రకళకు రూ.60వేల, దీలీప్‌కు రూ.28వేల, నూర్ సింగ్‌కు రూ.48వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, ఆసరా పింఛన్లు, రోగులకు సీఎంఆర్ఎఫ్, వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్, ఎంపీటీసీలు జ్ఞాను కేంద్రే, సగీర్ ఖాన్ ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం
నవతెలంగాణ-ఇచ్చోడ

ఆకల వర్షం, మరో వైపు ఈదురు గాలులు రావడంతో మండలంలోని జామిడి గ్రామంలో విద్యుత్ సరఫరా అవుతున్న విద్యుత్ వైరు తెగి రోడ్డుపై పడ్డాయి. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది వర్షాన్ని లెక్కచేయకుండా వారి బాధ్యతగా ఆ ప్రాంతానికి వెళ్లి స్తంభం నుండి రోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ వైర్‌ను సరి చేశారు. విద్యుత్ సిబ్బంది సరైన సమయంలో స్పందించి ఎలాంటి ప్రమాదం జరుగకుండా చూశారు. ముందస్తు చర్యలు చేపట్టిన నర్సాపూర్ సబ్ స్టేషన్ లైన్ మెన్ భూమన్న, జూనియర్ లైన్ మెన్ మల్లేష్‌ను గ్రామస్తులు అభినందించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి

నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి పౌష్టికాహార భోజనాన్ని అందించాలని ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల రెండు రోజుల కింద 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన కారణాలపై ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం అందించక పోవడంతోనే విద్యార్థిని క్యాల్షియం, శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతూ అస్వస్థతకు గురైనట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పిర్యాదు చేయడంతో ప్రిన్సిపల్ ఉపేందర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వార్డెన్ జితేందర్‌ను విధుల నుండి తొలగించారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని ఆర్సీఓ గంగాధర్‌ను సూచించారు. పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి వైద్యం అందించాలని



వైద్యసిబ్బంది ఆదేశించారు. నాణ్యమైన భోజనంతో పాటు మంచి వైద్యం అందిస్తామని పీఓ పోషకులకు భరోసా కల్పించారు. ప్రత్యేక వైద్య సిబ్బంది బృందంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసి, వివిధ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు పరీక్షించి జ్వరం జలుబు, దగ్గు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. వారి వెంట ఆర్సీఓ గంగాధర్, ప్రిన్సిపల్ ఉపేందర్, వైద్యసిబ్బంది, పోషకులు ఉన్నారు.

సైకిల్ పోలో పోటీల్లో విద్యార్థులు రాణించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

సైకిల్ పోలో పోటీల్లో గిరిజన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ఓఎస్‌డీ సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం పదవ తరగతి విద్యార్థుల బోధన పర్యవేక్షణలో భాగంగా స్థానిక బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సైకిల్ పోలో పోటీల్లో పాఠశాలకు చెందిన ఇద్దరు 8వ తరగతి విద్యార్థులు అంజని, వరలక్ష్మి అదేవిధంగా 7వ



తరగతి విద్యార్థి అహల్య పాల్గొని కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ క్రిస్టినా జడ్ చంగ్తు ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో పది జీపీఏ సాధించేలా ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాలల్లో భోజన మెనూను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థులకు సైకిల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గఫార్, వార్డెన్ శోభారాణి, క్రీడల నిర్వహణ అధికారి జీవరత్నం పాల్గొన్నారు.

మతోన్మాద చర్యలను తిప్పికొడదాం
నవతెలంగాణ-తాండూర్

మతోన్మాదం కార్పొరేట్ విధానాలు వ్యతిరేకిస్తూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధివిధానాలను ఎండగడుతూ ప్రభుత్వ, ప్రజా సంక్షేమం, మతసామరస్యం, సామాజిక న్యాయం కోసం, మార్చి 25న మంచిర్యాల జిల్లాలో జరిగే జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుల ఆశయ్య పిలుపునిచ్చారు. మండలం పెగడపల్లి వద్ద బస్సు జాత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ జన చైతన్య యాత్ర రథసారథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య వ్యవహరిస్తారని తెలిపారు ఈ బస్సు యాత్రకు ప్రజలు, కార్మికులు, లౌకికవాదులు, సామాజిక సంఘాల నాయకులు, మహిళలు, మేధావులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, రమణ, జిల్లా కమిటీ సభ్యులు దాగం రాజారాం, మండల కార్యదర్శి దేవదాస్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణి
నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని కోసిని గ్రామపంచాయతి పరిధిలోని కోలాంగూడ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని 20 నిరుపేద కుటుంబాలకు 5 క్వింటాళ్ల బియ్యం, పండ్లను పంపిణీ చేశారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ గ్రామస్తులు అటవీ జంతువులను చంపేందుకు విద్యుత్ తీగలను అమర్చవద్దని అలా చేయడం వల్ల అటవీ జంతువులతో పాటు మనుషుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి అటవీ జంతువులను చంపితే పీడియాక్టు నమోదు చేస్తామని తెలిపారు. బడీడు పిల్లలను ఖచ్చితంగా బడికి పంపించాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాల్యవివాహాల వల్ల జరిగే పరినామాలను ఎస్సై సోనియా వివరించారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సోనియా, ఏఎస్ఐ మనో, కోసిని సర్పంచ్ నగునూరి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి
నవతెలంగాణ-దహేగాం

పోలీసులు తమ విదుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సనత్ కుమార్ పాల్గొన్నారు

విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి
నవతెలంగాణ-బెజ్జూర్

విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గబ్బాయి గ్రామాన్ని ఆయన సందర్శించి విద్యార్థి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో గబ్బాయి గ్రామానికి చెందిన విద్యార్థి ఎలాది వెన్నెల కుటుంబానికి రూ.7 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల ఉట్నూర్‌లోని ఏకలవ్య గురుకులం పాఠశాలలో చదువుతున్న ఎలాది వెన్నెల బుధవారం తీవ్ర అనారోగ్యంతో మృతిచెందిందని, మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు సిడాం సకారాం, కృష్ణపెల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకట్రావ్, గిరిజన నాయకులు శ్రీహరి, సెడ్మక రమేష్, నైతం సత్తయ్య, ఆత్రం మాంతయ్య, ఎలాది నారాయణ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి
నవతెలంగాణ-కౌటాల

యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని గుడ్లబోరి గ్రామంలో గ్రామానికి చెందిన యూత్ సభ్యులకు క్రికెట్ కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో ప్రతిభ ప్రదర్శించాలన్నారు. యువకులు సమయాన్ని వృథా చేయకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువు, ఉద్యోగవకాశాల వైపు ప్రయత్నం చేయాలన్నారు. యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే పోలీసులు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎళ్లవేళల సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయన వెంట సర్పంచ్ రాందాస్, సబ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని పూసిగూడ వంతెన వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడకు చెందిన సోయం శ్రీనివాస్(28) వ్యవసాయం చేస్తున్నాడు. వివాహ కార్యక్రమానికి వెళ్లి వస్తు తిరిగి ఇంటికి వెళ్తుండగా ఏపీ 25 ఏజీ 3948 ద్విచక్ర వాహనం అతివేగంతో నడపటంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మేకల రవికాంత్
నవతెలంగాణ-తలమడుగు

బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా మేకల రవికాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల బీసీ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిగా మేకల రవికాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మేకల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా మండల పదవులను త్వరలో ప్రకటిస్తామని బీసీ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, బీసీ సంఘ నాయకులు ఆశమ్మ శ్రీనివాస్, నవీన్ యాదవ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం
నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పాలమూరు, రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలలో ఎమ్మెల్సీగా గెలుపొందిన ఏవీఎన్ రెడ్డిని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కుంరంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల మధు, జిల్లా కార్యదర్శి కాంద్రాపు మహేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి బండి రమేష్‌లు సన్మానించారు. ఆదివారం హైదరబాద్‌లోని కేశవ మెమోరియల్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ సమస్యలను రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల సమస్యల సాధనకు కృషి చేస్తానని అన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ బాలాజీ అన్నారు. ఆదివారం మండలంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో కుమ్మరితాండ పంచాయతీ పరిధిలోని రామాగూడ, మారుతిగూడ గ్రామాల్లో పీవీటీజీ కులస్తులకు సబ్సిడీపై కోడిపిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ నిరంతరంగా కృషి చేస్తుందని అన్నారు. అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తుందని అన్నారు. సబ్సిడీపై అందించిన కొడిపిల్లలను పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామాయిపేట్ సర్పంచ్ అయ్యుబాయి, వెటర్నరీ అధికారులు కిషన్, రమేష్, గ్రామస్తులు రవీందర్, ముకుంద్ రావు, ఆనంద్ రావు పాల్గొన్నారు.

సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలు హైదరాబాద్ లోని ఆర్టిలరీ సెంటర్ వేదికగా జరుగగా పోటీల్లో ఆదిలాబాద్ క్రీడాకారులు మూడు పతకాలు సాధించి సత్తా చాటారు. ట్రిపుల్ జంప్‌లో మడావి జంగు బాయి స్వర్ణం, హై జంప్‌లో ప్రియాంక రజత పతకం, జావెలిన్ త్రోలో దేవేంద్ర కాంస్య పతకాలను సాధించారు. పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులతో పాటు కోళ్ల రాకేష్, మాంజర్ కె.స్వప్నలను పేటా అసోసియేషన్ అధ్యక్షులు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి స్వామి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.రాజేష్ అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. పీడీలు అలివేలు, ప్రియాంకరెడ్డి మహేష్ ఉన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన తరుణంలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులతో తెలంగాణ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన హాత్ సే హాత్ జూడో యాత్ర ఆదివారం మండలానికి చేరుకుంది. ఈ యాత్రలో భట్టి పాల్గొనడంతో మండలంలోని పులిమడుగు గ్రామానికి చేరుకోగానే కాంగ్రెస్ పార్టీ ఉట్నూర్ మండల నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి కుమ్మరి తాండ, ఎందా ఎక్స్ రోడ్డు వరకు సాగింది. ప్రభుత్వం అధీనంలో ఉండే టీఎస్పీఎస్సీలో ఉద్యోగాలకు నిర్వహించే ప్రశ్నపత్రాలు చోరీ వెనుక ప్రభుత్వ హస్తం ఉందని, దీనికి సీఎం కేసీఆర్ నైతిక బాధ్యత వహించాలని డిమాండ్‌తో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఎంతో ఆశతో ఉద్యోగాలు వస్తాయనుకొని సిద్ధం అవుతున్న యువత ఆశలు నిరాశగానే మిగిలాయని అన్నారు. ప్రశ్నపత్రాలు లీకేజీలో పెద్దల హస్తం ఉందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ లికేజీని సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని అన్నారు. టీఎస్పీఎస్సీ కన్వీనర్, సభ్యులను బర్తరఫ్ చేసి వారిని విధుల నుంచి తొలగించాలని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎందాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అడుగడుగునా ఆదివాసులను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని అన్నారు.



కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం వైఎస్సార్ పోడు భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసులందరికి అటవీ హక్కుల చట్టంను తీసుకవచ్చినప్పటికి, ఇప్పటి కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పోడు భూముల కోసం ఆదివాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న కేసీఆర్ కాలయాపన చేస్తూ వస్తున్నారని అన్నారు. పోడు భూముల్లో సాగు చేస్తున్న ఆదివాసులపై ఫారెస్ట్ అధికారులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చట్టాల పేరుతో ఆదివాసులను అడవులకు వెళ్లనియకుండా చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ ఆయాంలో ఒక్కరికి కూడా అటవీ హక్కు పత్రం ఇవ్వలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రాజెక్టులను కట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కానీ ప్రాజెక్టులకు కాలువలు నిర్మించకపోవడంతో సాగు నీరు అందకుండా పోతుందని అన్నారు. ఇంటింటికీ తాగునీరుని అందించేందుకు తీసుకవచ్చిన మిషన్ భగీరథలో అడుగడుగునా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని అన్నారు. ఇందుకు నిదర్శనమే ఏజెన్సీలో ఒక ఇంటికి కూడా నల్లా నీరు అందడం లేదని ఆరోపించారు. ఇప్పటికి చెదుడు బావి నీరు తాగుతున్నారని నేను పాదయాత్రలో వస్తున్న క్రమంలో ఇంద్రవెల్లి మండలంలోని పలు ఆదివాసీ గ్రామాల్లో కపించాయని అన్నారు. కుమ్మరితాండ గ్రామంలో పేదోడి ఫ్రీజ్ లను తయారు చేసి వారి బాధలు వర్ణనాతీతమని అన్నారు. కుండలకు తయారీ చేసేందుకు పుట్టమన్ను కోసం అడవికి వెళ్లకుండా అటవీ అధికారులు అడ్డుకోవడం సరికాదని అన్నారు. కుండల తయారీని నమ్ముకుని జీవిస్తున్న వారిని ఇబ్బందులకు గురి గురిచేయవద్దని అన్నారు. ధరణిలో ఎక్కువగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సమస్యలే దర్శనమిస్తున్నాయని అన్నారు. అప్పటి తెలంగాణలో బ్రిటిష్ పాలనలగా కేసీఆర్ పాలిస్తున్నారని తెలిపారు.



కొనసాగుతున్న యాత్ర...

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క జిల్లాలో చేపట్టిన యాత్ర ఆదివారం మండలానికి చేరుకుంది. ముందుగా పులిమడుగు గ్రామం మీదుగా కుమ్మరితాండ, ఎందా, గోదరిగూడ, శ్యాంపూర్, ఎక్స్ రోడ్డుకు చేరుకుంది. భట్టి రాకతో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. యాత్రలో భాగంగా రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులకు, ప్రజలకు అభివాదం తెలిపారు. స్థానిక సమస్యలపై ప్రస్తావించారు.

స్వరాష్ట్రం కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి సాదించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ బ్రిటీష్ పాలనలాగా పరిపాలిస్తున్నట్లు యాత్రలో మాట్లాడారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే తెలంగాణను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన పార్టీ కార్నర్ మీటింగ్‌లో పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మండలంలో లాల్ టెక్డిలో బస చేశారు. భట్టి వెంట మాజీ ఎమ్మెల్సీ ప్రేమసాగర్ రావు, డీసీసీ అధ్యక్షుడు సాజిత్ ఖాన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, రాష్ట్ర, నియోజకవర్గ, మండల నాయకులు భరత్ చౌహన్, పెందూర్ ప్రభాకర్, పుర్క బాపురావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే పల్లెలకు మహర్దశ

నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత పల్లెలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే రేఖ నాయక్ అన్నారు. ఆదివారం ఖానాపూర్ ఆయా గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి రూ.2 లక్షలు, బోయ సంఘం అభివృద్ధి రూ.2 లక్షలు ప్రొసీడింగ్స్ కాపీలను అందజేశారు. సుర్జాపూర్ గ్రామంలో యాదవ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. యాదవ సోదరుల అభివృద్ధికి రెండో దఫా గొర్రెల పంపిణీ కార్యక్రమం త్వరలోనే ప్రారంభం కానుందని అన్నారు. ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్‌లో పార్టీ నాయకుడు సురేష్ పెద్దమ్మ ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.

కరెంట్ మోటర్ల వైర్లు చోరీ

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



చోరి అయిన విద్యుత్ వైర్లను చూపిస్తున్న రైతు

పంటపొలాల సాగుకోసం గోదావరి తీరంలో రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటర్ల కరెంట్ తీగలను (సర్వీసువైర్) శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రైతు దాసరి గంగన్న మోటారుకు సంబంధించిన రూ.2వేల 200 విలువైన 20 మీటర్ల సర్వీసు వైరు, గాడుపు రాజేశ్వర్‌కు చెందిన రూ.1,980 విలువైన 18 మీటర్లు, ఎల్.గోపాల్‌కు చెందిన రూ.2వేల 500 విలువైన 22 మీటర్లు, ఆడెపు భీమన్న రూ.2వేల ఆరువందల విలువైన 25, జంగాల చిన రాజేశ్వర్ 1500 విలువైన 20 మీటర్లు, దాసరి చిన్నయ్య రూ.2వేల 100 విలువైన 20 మీటర్ల కరెంట్ వైరును ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. స్టార్టర్ నుంచి మోటర్ వరకు అమర్చిన సర్వీసు వైరును రాతి బండపై పెట్టి మరో బండ రాయితో కొట్టి తెంపేసి ఎత్తుకెళ్లారు. దొంగలు రాత్రి సమయంలో ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని రైతులు తెలిపారు. దొంగలు వైర్లు ఎత్తుకెళ్లడంతో తాము ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, పనిబారం పెరిగి సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. మూడు నెలల కింద పలువురి రైతులకు సంబంధించిన మోటర్ల సర్వీసు వైర్‌ను ఇలాగే ఎత్తుకెళ్లారని రైతులు వివరించారు.

ఎమ్మెల్యేను కలిసిన కుచులాపూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కుచులాపూర్ గ్రామంలోని పూలాజీ బాబా ధ్యాన మందిర నిర్మాణానికి నిధులు కేటాయించాలని కుచులాపూర్ గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కలిసి విజ్ఞప్తి చేశారు. కుచులాపూర్‌లో గ్రామంలో కొత్తగా నిర్మించ తలపెట్టిన సద్గురు పూలాజీ బాబా ధ్యాన మందిరానికి సభ్యులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మొదటి విడతగా రూ.5 లక్షలు త్వరలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే, సర్పంచ్ మొహితే ప్రభా, దేవరావు, ఉప సర్పంచ్ సోనులే కిషన్, రవీందర్ పేట్కులే, రాములు శిండే, బోనగిరి విఠల్, నాగోషే సంజీవ్, రాగి సంతోష్, పేట్కులే రమేష్, మహిళా మండలి సభ్యులు గంగుబాయి శిండే, సేవంత పెట్కులే, సునంద గుర్నులే పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద, కార్పొరేటు విధానాలను వ్యతిరేకించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య
- జన చైతన్య యాత్ర పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-నిర్మల్

బీజేపీ మతోన్మాద కార్పొరేటు విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆడివయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదామని అన్నారు. ఈ మేరకు మార్చి23 నుండి 29 వరకు పార్టీ అఖిల భారత కమిటీ పిలుపులో జన చైతన్య యాత్ర కొనసాగుతుందని అన్నారు. 23న నిర్మల్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ కార్యాలయం ముందు సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని అన్నారు. మోడీ, అమిత్ షాల నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ, ప్రజలపై భారాలను మోపుతూ దేశంలో 23 కోట్ల మందిని నిరుపేదలుగా చేశారని అన్నారు. దేశం అంటే అంబానీ, ఆదాని, సొత్తుగా మార్చేశారని విమర్శించారు. నూనెలు వంటగ్యాస్, పెట్రోల్, డిజిల్‌తో సహా అన్ని నిత్యవసర సరుకులు ధరలు రెండు, మూడు రెట్లకు పైగా పెంచారని అన్నారు. 2014లో రూ.410 ఉన్న వంట గ్యాస్ నేడు రూ.1150 పెరిగిందని అన్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల కార్పొరేటు శక్తులు వేల కోట్ల రూపాయలు లాభాలను పోగేసుకుంటున్నారని అన్నారు. లక్షల కోట్లు ఖర్చుపెట్టి బలోపేతం చేసిన ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని మండిపడ్డారు. భూములను, మార్కెట్లను, పరిశ్రమలను, ఉపాధి కల్పించే రంగాలను పూర్తిగా కార్పొరేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, లౌకిక వాదులు, మేధావులు జన చైతన్య యాత్రలో భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, జిల్లా కమిటీ సభ్యులు డాకుర్ తిరుపతి, శంభూ, అరవింద్ పాల్గొన్నారు.



పెంబి : మండలకేంద్రంలో ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపడుతున్న జన చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేటు విధానాలను వ్యతిరేకించాలని, సంక్షేమం, మతసామరస్యం ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం కోసం పోరాడుదామని అన్నారు. మార్చి23 నుండి 29 వరకు సీపీఐ(ఎం) పార్టీ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ కార్యాలయం ముందు సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ ఉంటుందని అన్నారు. నిర్మల్ జిల్లాలో జన చైతన్య యాత్రలు జరుగుతాయని అన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యవాదులు, లౌకిక వాదులు, మేధావులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పెంబి మండల నాయకులు కుడ్మెత మహదు, తొడసం తిరుపతి, సీడం బల్లు, టెకం రాజు పాల్గొన్నారు.

ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-పెంబి

ఈనెల 25, 26, 27 తేదిల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరుగబోయే ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. ఆదివారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని ఆయిల్ గ్యాస్, స్టీల్, బొగ్గు, కరెంట్, టెలికాం తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మడానికి పెట్టిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారు. అందుకే కార్మికుల హక్కుల కోసం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవటం కోసం ఈ మహాసభలు జరుగుతాయని అన్నారు. ఈ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, విజయ్, రాజుబాయి, నిర్మల పాల్గొన్నారు.

యూఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విల్ చైర్ పంపిణీ

నవతెలంగాణ-ఖానాపూర్

మండలం సోమర్‌పేట్ గ్రామానికి చెందిన బాలుడు అంగ వైకల్యంతో ఉండగా ఆదివారం ఎమ్మెల్యే రేఖా నాయక్ వీల్ చైర్‌ను అందజేశారు. మస్కాపూర్ గ్రామానికి చెందిన ఉప్పు సాయి రామ్ తన యూఆర్ (ఉప్పు రాజన్న) ట్రస్ట్ ఆధ్వర్యంలో విల్ చైర్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీల్ చైర్‌ను వికలాంగ బాలుడికి అందజేసి తన ఉదారత చాటుకున్న ఉప్పు సాయిరామ్ కుటుంబ సభ్యులను అభినందించారు. మరిన్ని మంచి పనులు చేసి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, వెంకగౌడ్, శంకర్ ఉన్నారు.

అన్నదానానికి సరకులు అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఈనెల 23న జరుగనున్న అఖండ హనుమాన్ చాలీసా కార్యక్రమం నేపథ్యంలో మహాన్నదానం ప్రసాదం కోసం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అనుచరుడు కృష్ణంరాజు వంట సామగ్రి, బియ్యం, భోజనానికి అవసరమైన సరకులను అందజేశారు. ఈ క్రమంలో ఆయనను ఆలయ కమిటీ సన్మానించింది. ఈ కార్యక్రమంలో దూడం శ్రీనివాస్, బీసీ రమేష్, బిక్కి కృష్ణ, దివాకర్, హరీష్ పాల్గొన్నారు.

గేట్ ఫలితాల్లో ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బాసర

గేట్ 2023 సంవత్సర ఫలితాలలో ఆర్జీయూకేటీ యూనివర్సిటీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆదివారం యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో చైతన్య 293 ర్యాంకు, మణిప్రసాద్ కుదురుపాక 912 ర్యాంకు, గజే జగదీష్ 234 ర్యాంకు, కే.శివ కుమార్ 563 ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారని అన్నారు. మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులను యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఈసీఈ అధ్యాపకులు కార్తీక్, ధీరజ్, ప్రణయ, తేజస్విని, నీలిమ పాల్గొన్నారు.

ఆలయంలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి అమ్మవారి ఆలయంలో అగ్ని ప్రమాదాల నివారణకు ఆలయ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం చర్యలు చేపట్టినట్లు ఆలయ ఈ ఓ విజయరామారావు తెలిపారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులోకి తీసుకవచ్చి ప్రమాదాలు చోటు చేసుకునే ప్రదేశాలలో అందుబాటులో ఉంచడం జరుగుతుందని అన్నారు. ప్రధానంగా లడ్డు ప్రసాదాల తయారి, అన్నదానం, క్యూ లైన్, ఆలయంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ శరత్ పాటక్, ఏఈఓ సుదర్శన్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పట్టణాభివృద్ధి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని పలు వార్డులను పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక 47వ వార్డు పరిధిలో రూ.23లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్క్‌ను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేశారు. అనంతరం పార్క్‌లో ఏర్పాటు చేసిన వివిధ పరికరాలను పరిశీలించి కాసేపు వ్యాయామం చేశారు. చిన్నారులు ఆడుకోడానికి ప్రత్యేకంగా అందుబాటులో ఉంచిన ఆట పరికరాలను పరిశీలించారు. ఎమ్మెల్యేను కౌన్సిలర్ సోమ స్వప్న స్థానికులతో కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత పట్టణంలో కోట్లాది రూపాయల నిధులతో ప్రజలకు మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు గానూ ఇప్పటికే పదహారు కోట్ల రూపాయలతో అరవై పార్కులు, రెండు కోట్ల నాలుగు లక్షలతో పదహారు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నియోజకవర్గాన్ని అభ్యున్నతి పథంలో నడపడమే లక్ష్యంగా దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పుర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు బండారి పోశన్న, రాజు, బాల శంకర్ కృష్ణ, బియ్యాల అనసూయ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11మంది లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఏండ్లు కష్టపడి సాధించిన రాష్ట్రాన్ని ఇష్టపడి అభివృద్ధి పథంలో సీఎం కేసీఆర్ నడిపిస్తున్నారని అన్నారు. అదేవిధంగా పేదింటి బిడ్డయిన ఆపదలో ఉంటే ఇంటి పెద్దగా సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మెట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వెంకటేష్, గుడిహత్నూర్ మండల కన్వీనర్ బ్రహ్మానంద్, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు గంగాధర్, అబ్దుల్లా, జీవన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రామకృష్ణ, భీమన్న, శంకర్, ప్రకాష్ నాయకులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా యువకుడి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

కూలీ పనులను వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వ్యాన్ బోల్తా పడ్డ సంఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని ఎక్స్‌రోడ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్సై భరత్ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన వినేందర్(18)తో పాటు మరో ముగ్గురితో కలిసి శనివారం కూలీ పనుల నిమిత్తం ఇంద్రవెల్లికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వ్యాన్‌లో వస్తున్నారు. రాత్రి కావడంతో మండలంలోని ఎక్స్ రోడ్డు రాగానే ఎదురుగా గేదెను తప్పించబోయడు. ఈ క్రమంలో వాహనం అదుపు తప్పు ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వినేందర్ మృతి చెందారు. కుటుంబ బాధ్యతలు మోస్తూ, కుటుంబానికి ఆసరాగా ఉండే వినేందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పట్ల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

నవతెలంగాణ- బేల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని, గతంలో లేని విధంగా మెడికల్ కాలేజీల ఏర్పాటుతో పాటు పెద్ద ఎత్తున డాక్టర్ల నియామకం చేపట్టి ప్రజలకు సేవలందిస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా రూ. 1కోటి 56లక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న కొత్త ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి నిధులు కేటాయించి భూమిపూజ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రజలకు ఆరోగ్య విషయంలో పెద్ద పీట వేస్తూ మెడికల్ కాలేజీలతో పాటు డాక్టర్ల కొరత లేకుండా చూస్తున్నామని అన్నారు. ప్రజలు ఆరోగ్య విషయంలో మరింత చేరువ కావడానికి బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, ఎంపీపీ వనిత ఠాక్రె, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, పీహెచ్‌సీ వైద్యుడు వంశీ కృష్ణ, సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంభీర్ ఠాక్రె, జక్కుల మధుకర్, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, మంగేష్ ఠాక్రె, దేవన్న, బండి సుదర్శన్, కిషన్ వైద్య గోడం సునీల్, విపిన్ ఖోడే పాల్గొన్నారు



ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నవతెలంగాణ-బాసర

ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తహసీల్దార్ నారాయణ అన్నారు. శనివారం సాయంత్రం నాగభూషణం విద్యాలయంలో పదో తరగతి విద్యార్థుల విడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు కలలు సహకారం చేసేందుకు ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదవాలని కోరారు. అంతకుముందు వీడ్కోలు సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్సై మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురావు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో పాము కలకలం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పాము కలకలం సృష్టించింది. పట్టణంలోని క్రీడా పాఠశాల, వసతి గృహంలో ఆదివారం ఉదయం పాము కనబడటంతో సిబ్బంది స్థానిక శాంతినగర్‌కు చెందిన పాములు పట్టే నయీముద్దీన్ సమాచారం అందించారు. వెంటనే ఆయన చేరుకొని పామును పట్టుకున్నారు. దీంతో సిబ్బంది, విద్యార్థులు, ఊపిరి పీల్చుకున్నారు.

కేంద్రంలో రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-జన్నారం



కేంద్రంలో రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొర్రకుంట ప్రభుదాస్ ప్రధాన కార్యదర్శి పసియుల్లా అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు అదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ మహాసభకు భారీగా తరలి వెళ్లారు. బట్టి విక్రమార్క చేస్తున్న జోడో యాత్ర సందర్భంగా ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ జూడో యాత్ర లక్షమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, దుమల రమేష్, గంగన్న పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- 9 మందిపై కేసు నమోదు

నవతెలంగాణ-వాంకిడి

పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను ఆదివారం వాంకిడి పోలీసులు అరెస్టు చేశారు. మండలకేంద్రంలోని ఇందిరానగర్ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద రూ.23,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎవరైన పేకాట, ఆన్‌లైన్‌లో జూదం ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైన పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

జనచైతన్య యాత్ర విజయవంతం చేయాలి

- పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్
- యాత్ర వాల్ పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 24వ తేదీన జిల్లాలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం జిల్లా కేంద్రంలో విడుదల చేసిన అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవి రాఘవులు యాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య నాయకత్వం వహిస్తాడని వివరించారు. 24వ తేదీన జిల్లాలో ప్రవేశించే యాత్రకు జైనూర్ మండలంలోని ఆశాపెల్లి వద్ద బైక్ ర్యాలీతో స్వాగతం పలకడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జైలు వద్దనుండి అంబేద్కర్ చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడే సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అనంతరం కాగజ్ నగర్ కేంద్రంలో సాయంత్రం 7 గంటలకు బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ మతోన్మాద కార్పొరేటు విధానాలను వ్యతిరేకించాలని, సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదామని ఇదే లక్ష్యంతో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడీ, అమిత్‌షాల నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతూ 123 కోట్ల మందిని నిరుపేదలుగా చేశారన్నారు. దేశం అంటే అంబానీ ఆదాని సొత్తుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నూనెలు వంటగ్యాస్, పెట్రోల్, డిజిల్ తోసహా అన్ని సరుకులు ధరలు రెండు మూడు వందల రెట్లు పెంచారన్నారు. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ బండ నేడు రూ.1150కి పెరిగిందన్నారు. ఈ ధరల పెరుగుదలవల్ల కార్పొరేటు శక్తులు రూ.వేల కోట్ల లాభాలను గడిస్తున్నారని అన్నారు. రూ. లక్షల కోట్లు ఖర్చుపెట్టి బలోపేతం చేసిన ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు అమ్మేస్తున్నారన్నారు. భూములను మార్కెట్లను పరిశ్రమలను ఉపాధి కల్పించే రంగాలను పూర్తిగా కార్పొరేట్ పరం చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు లాంటిదని లౌకిక వాద విధానం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా చేస్తున్న జన చైతన్య యాత్రలో ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అల్లూరి లోకేష్, గొడిసెల కార్తిక్, రాజేందర్, దుర్గం రాజ్ కుమార్, నాయకులు టీకానంద్, రాజేష్, తిరుపతి, నిఖిల్, సతీష్ పాల్గొన్నారు.



జిల్లాలో 6 రోజులు 105 కిలోమీటర్లు యాత్ర

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు
- హాత్ సే హాత్ జోడోయాత్ర సన్నాహక సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేస్తున్న హాత్ సే హాత్ జోడోయాత్ర జిల్లాలో ఆరు రోజులపాటు 105 కిలోమీటర్లు కొనసాగనుందని ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యుడు ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తిరుమల లాడ్జిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడోయాత్ర కార్యకర్తల సన్నాహక సమావేశానికి పాదయాత్ర కోఆర్డినేటర్ సయ్యద్ అంజముల్లా హుస్సేన్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరు రోజులపాటు యాత్ర కొనసాగనుందన్నారు. ఈ నెల 20వ తేదీన జైనూర్ మండలంలో యాత్ర ప్రారంభమై, 21వ తేదీ సాయంత్రం నాటికి కెరమెరి మండలం చేరుకుంటుందని, 22, 23 తేదీలలో ఉగాది పండుగను పురస్కరించుకొని యాత్రకు స్వల్ప విరామం ఇవ్వడం జరుగుతుందన్నారు. 24న తిరిగి ప్రారంభయ్యే యాత్ర 25వ తేదీన జిల్లా కేంద్రానికి చేరుకుని అంబేద్కర్ చౌక్ వద్ద కార్నర్ సమావేశం లేదా ప్రేమల గార్డెన్ వద్ద బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. 26, 27 తేదీల్లో కూడా జిల్లాలో యాత్ర కొనసాగి 27వ తేదీ మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో పూర్తిగా విఫలమయ్యాయని ఆ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడానికి ఈ యాత్ర పనిచేస్తుందన్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను విజయవంతం చేయాలన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ బీజేపీ పరిపాలన చేస్తుందని ఇది లౌకిక వాదానికి గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత వచ్చిందని కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్డి ఎంఆర్సి ఇన్‌ఛార్జి పెన్నింటి రఘునాథ్‌రెడ్డి, పీసీసీ సభ్యులు అనిరుద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొట్ల నాగేశ్వరరావు, పీసీసీ కార్యదర్శి మర్సుకోల సరస్వతి, సభ్యుడు డాక్టర్ గణేష్ రాథోడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండా శ్యామ్, ఎల్డిఎంఆర్సి రవీందర్ రెడ్డి, రెబ్బెన మాజీ జడ్పీటీసీ దుర్గం సోమయ్య, నాయకులు వసంతరావు, దుర్గం జీవన్, వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ రిపోర్టర్ రాంరెడ్డి సేవలు మరువ లేనివి

నవతెలంగాణ-నస్పూర్

కోల్బెల్ట్ శ్రీరాంపూర్, సీసీసీ కోల్బెల్ట్ సీనియర్ రిపోర్టర్ యెక్కటి రాంరెడ్డి సేవలు, తెలంగాణా ఉద్యమంలో ఆయన చేసిన సేవలు మరువ లేనివని నస్పూర్, శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూపతి రవి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ల రాజేశంలు అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఆర్కే6 గుడిసెల్లోని శారధా శిశుమందిర్, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాంరెడ్డి ప్రథమ వర్ధంతి సభలో వారు మాట్లాడుతు యెక్కటి రాంరెడ్డి విద్యావంతునిగా, ఉపాధ్యాయునిగా తాను చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. సకలజనుల సమ్మె తెలంగాణా ఉద్యమానికి కన్వీనర్ ఉండి 44 రోజుల పాటు నిరాహార దీక్షా శిభిరాన్ని నిర్వహించారని చెప్పారు. కోల్బెల్ట్ ప్రాంత విద్యా సంస్థల అధ్యక్షుడిగా విద్యార్థులను తెలంగాణా ఉద్యమంలోకి తీసుకచ్చి ప్రజల్లో చైతన్యం నింపిన ఘణత ఆయనకే దక్కుతుందన్నారు. కోల్బెల్ట్ తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుగా నిలిచారని చెప్పారు. జర్నలిస్ట్‌గా 36 సంవత్సరాలపాటు తన సేవలందించారని, ప్రజలకు అన్ని వేళలా ఒక సలహాదారుగా ఆదర్శంగా నిలిచారని, శ్రీరాంపూర్, ఆర్కే 6 గుడిసెల ప్రాంత ప్రజలు ఆయన సేవలు మరువలేరన్నారు. గుడిసెలు ఉన్నంత కాలం రాంరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు.



కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్, నస్పూర్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు క్యాతం రాజేష్, కోశాధికారి నారాయణరెడ్డి, సభ్యులు కోడం రవి, రాములు, మల్లేశం, పురుషోత్తం, సాగర్, నర్సయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, బుచ్చిరెడ్డి, రాజ్ కుమార్, సతీష్, నరేందర్ పాల్గొన్నారు.

భట్రాజు సంఘం బలోపేతానికి కృషి చేయాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కేసిపెద్ది రామరాజు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భట్రాజు సంఘ బలోపేతానికి సంఘ సభ్యులు కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు కేసిపెద్ది రామరాజు అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణంలో నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నికల పరిశీలకులు తుమికి శంకర్ రాజు వ్యవహరించగా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కులానికి తగిన ప్రాధాన్యత లభించాలంటే అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. తమ కులానికి ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా భట్రాజు సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీధర్ రాజు, చంద్రశేఖర్ రాజు పాల్గొన్నారు.

సంఘం జిల్లా అధ్యక్షుడిగా జగన్నాథ రాజు

సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎ.జగన్నాథరాజు ఎన్నిక కాగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగాఎ. కృష్ణంరాజు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా బి.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా టి.మధుసూదన్, సంయుక్త కార్యదర్శి ఎ. నరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు టి. శ్రీహరి, కార్యవర్గ సభ్యులుగా ఎన్.సుధాకర్, ఎస్.శ్రీనివాస్, రామరాజు, వంశీ, రాజమొగిలి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రేవంత్ రాజు, ఉపాధ్యక్షుడిగా శశిధర్, సంయుక్త కార్యదర్శిగా సాయిరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.రమాదేవి, ప్రధాన కార్యదర్శిరాలుగా ఏ.వీనాదేవి, ఉపాధ్యక్షురాలుగా ఎస్.శైలజ, లక్ష్మి, సంయుక్త కార్యదర్శిరాలుగా స్వర్ణలత, కోశాధికారిగా సరోజ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అభినయశ్రీ, కార్యవర్గ సభ్యులుగా పూజ, నాగాంజలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అజాగ్రత్తగా కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-భీమారం



అద్దె కారును అగ్రత్తగా నడిపి రోడ్డు ప్రమాదానికి కారణం అయిన వ్యక్తిపై కేసు నమేదు చేసినట్లు స్థానిక ఏఎస్సై భూమన్న తెలిపారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో టీ.ఎస్ 29పీ 0461 నెంబర్‌గల కారులో మండలానికి చెందిన కొమ్ము రంజిత్ అనే వ్యక్తి అజాగ్రత్తగా నడుపుతూ స్థానిక అటవీ కలప డీపోవద్ద రోడ్డు ప్రమాదానికి కారణమయ్యాడని తెలిపారు. కారును అతి వేగంగా నడిపి రోడ్డు పక్కన ఉన్న కంకర కుప్పపై ఎక్కించాడు. ఈ క్రమంలో కారు బోల్తా పడిందని తెలిపారు. ఈ ప్రమాదంలో అందులో ప్రయానిస్తున్న వారికి స్వల్ప గాయాలు అయినప్పటికీ కారు పూర్తిగా ధ్వంసం అయ్యిందని తెలిపారు. ఈ కారును లాంగ్ డ్రైవ్ ఆప్ ద్వారా బుక్ చేసుకోగా.. బుక్ చేసిన వ్యక్తి కొమ్ము మనోహర్ ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఆయన దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని నిరసన



నవతెలంగాణ-కౌటాల

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండలంలోని ముత్తంపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముందు నిరసన తెలిపి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం కృష్ణమాచారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత 20 ఏండ్లుగా గ్రామీణ స్థాయిలో వీఓఏలుగా పనిచేస్తున్న వారికి రక్షణ లేకుండా పోయిందని, వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి చర్యలు చేపట్టాలన్నారు. వేరే అన్ని రకాల రుణాలు ఇప్పించి తిరిగి చెల్లిస్తున్నారని, వారికి ఎలాంటి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగభద్రత కల్పించి, కనీస వేతనం నిర్ణయించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, దత్తు, రవి పాల్గొన్నారు.

లత పాఠశాల, కొచ్చింగ్ సెంటర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఆల్ ఇండియా సైనిక్ పాఠశాలలో మందమర్రిలోని స్థానిక శ్రీపతి నగర్‌లో గల లత అప్పర్ ప్రైమరీ స్కూల్, నవోదయ, సైనిక్ కోచింగ్ సెంటర్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు జె.ప్రణయ్ 3003, కె.శశాంక్ హర్ష 3652 జె.జై శ్రీ 8985 ర్యాంకులతో మొదటి కౌన్సిలింగ్ లో ప్రవేశ అర్హత సాధించారు.జనవరి 8న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 6 వ తరగతికి ప్రవేశ పరీక్షలు జరిగాయి. అందులో మొదటి కౌన్సిలింగ్ లో లత కోచింగ్ లో కోచింగ్ తీసుకున్న ఈ ముగ్గురికి ప్రవేశ అర్హత సాధించారు. ఈ సందర్భంగా లత స్కూల్ ప్రిన్సిపాల్ లత శ్రీ మాట్లాడుతూ,సైనిక్ స్కూల్ లో అర్హత సాధించిన ముగ్గురు విద్యార్థులకు అభినందనలు తెలియజేసారు..మిగతా పిల్లలు అందరూ మంచిగా చదివి పోటీ ప్రవేశ పరీక్షలలో అర్హత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-జైనూర్

గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఆరో మహాసభను విజయవంతం చేయాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర నాయకుడు ఇటికల శంకర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన సంఘం సభ్యులతో కలిసి మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసినట్టు పేర్కొన్నారు. అందులో భాగంగా మార్చి 24, 25వ తేదీన హుస్నాబాద్ పట్టణంలో ఆరో రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు అన్ని సంఘాల నాయకులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాగ్మారె కంబాజీ, కామ్లె గణేష్, మోరె కైలాశ్, కామ్లె మారుతి, గాయిక్వాడ్ మాధవ్, రియాజ్ పాల్గొన్నారు.

గూడెం సత్యదేవుని దర్శించుకున్న కలెక్టర్

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం రామ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం మంచిర్యాల కలెక్టర్ బాధావత్ సంతోష్ నాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ సిబ్బంది వేద పండితులతో కలెక్టర్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. ఆలయ సిబ్బంది కలెక్టర్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆరో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సంర్భంగా సాయినాథుడికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారి మల్లొజ్జుల చంద్రశేఖర్ శర్మ ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, కమిటీ సభ్యులు సత్యనారాయణగౌడ్, చంద్రమౌళి గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌కు చేరుకున్న హితేంద్ర రిషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైన సంత్ శ్రమన్ సంఘ్ యువచార్య మహేంద్ర రిషి ఆదివారం ఆసిఫాబాద్ జిల్లాకు చేరుకున్నారు. యువాచార్య మహేంద్ర రిషి, హితేంద్ర రిషి, ధవల్ రిషి మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి వాంకిడి మీదుగా కాలినడకన ప్రయాణిస్తూ ఆసిఫాబాద్ చేరుకున్నారు. గురు భగవంతోకు ఆసిఫాబాద్ జిల్లా జైనసంఘం యువ మండల, మహిళా మండలం ఘనంగా స్వాగతం పలికారు. దీని తర్వాత గురు భగవంత్ ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు కాలినడకన వెళ్లనున్నారు.

అపరిచిత వ్యక్తులను నమ్మవద్దు

- ఎస్సై దీకొండ రమేష్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే నమ్మి మోసపోవద్దని, సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయని, తెలిసిన వారి ఫోన్‌లనే స్పందించాలని ఎస్సై దీకొండ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుడ్కిళి గ్రామానికి చెందిన చందన్‌కాడె తేజస్ అనే విద్యార్థి ఈ నెల 15వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి నేను మిషన్ భగీరథ సైటు ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నానని, మిషన్ భగీరథలో పనిచేయడానికి 10 మంది వ్యక్తులు ఒకరు సూపర్‌వైజర్ నావద్ద పనిచేయడానికి అవసరముందని చెప్పి ఒక్కొక్కరి నుండి రూ.4500 కట్టాలని, మీరే జమచేసి డబ్బులు ఫోన్ పే ద్వారా పంపించాలని సదరు వ్యక్తి తెలియజేశారు. దీనికి తేజస్ స్పందించి ఈ నెల 15వ తేదీన రూ.15 వేలు పంపించారు. తిరిగి 16వ తేదీన మిగిలిన రూ.34,500 పంపించాలని తెలపగా పంపించారు. ఈ నెల 18వ తేదీన తిరిగి మళ్లీ ఫోన్ చేసి అదనంగా మరో ముగ్గురు వ్యక్తులు అవసరముందని వారి వద్ద నుండి డబ్బులు జమచేసి పంపిస్తే అందరికి ఒకేసారి పని కల్పిస్తామని తెలపడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

సిద్ధేశ్వర ఆలయంలో సామూహిక వివాహాలు



నవతెలంగాణ-జైనూర్

మండలంలోని పాట్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల సిద్ధేశ్వర సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం నాలుగు జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. సిద్ధేశ్వర ఆలయంలో పూలాజీబాబా చేసిన సేవలను గుర్తించి ఆలయంలో సంస్కృతి సాంప్రదాయాలతో ప్రతి ఏడాది సామూహిక వివాహాలు జరిపిస్తారు. ఈ వివాహ వేడుకలను ఆలయ సంస్థాన్ అధ్యక్షుడు కేశవరావు ఇమ్లె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వర ఆలయంలో సామూహిక వివాహాలు నిర్వహించడం ఎంతో గొప్ప పరినామమన్నారు. పూలాజీ బాబ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. సిద్ధేశ్వర ఆలయంలో సామూహిక వివాహాలు ప్రియాంక- కందారె సిదాం, శ్రీదేవి-దీపక్, కవిత-అక్రె సుదామ, విజయలక్ష్మి-అక్రె చరణ్ నాలుగు జంటలకు ఆయన ఆశిర్వదించారు. కార్యక్రమంలో పాట్నాపూర్ గ్రామ సర్పంచ్ కందారె బాలాజీ, ఆదివాసీ సేవా సమితి అధ్యక్షుడు మొకాడె విష్ణు, సిద్ధేశ్వర ఆలయం సంస్థాన్ ఉపాధ్యాక్షుడు వామన్ ఇమ్లె, గ్రామస్తులు డుడ్రె సుభాష్, దాదారావు, శ్యాంరావు, ఇందర్‌వెల్లి ఎంపీపీ శోభ, జైనూర్ వైస్ ఎంపీపీ కందారె గన్ శాం, గ్రామస్తులు జనార్ధన్, రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాలీబాల్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యారంగ సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్, విద్యారంగ సమస్యల యాత్ర అధ్యయన కన్వీనర్ గడ్డల ప్రణయ్ విద్యార్థులను కలిసి వారి సమస్యలు తెలుసుకుని, వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు శారీరక ధృడత్వం కూడా అవసరమేనని విద్యార్థులు ఆటల్లో సైతం చురుగ్గా పాల్గొనాలన్నారు. వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని అధికారులు వెంటనే స్పందించి పక్కా భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యాత్ర కో కన్వీనర్ సిరికొండ సాయి కృష్ణ, యువ నాయకులు పసుపునూరి సాయి చరణ్, గడ్డల ప్రణీత్, కోటేష్ పాల్గొన్నారు.

గుస్సాడీ కళాకారుడికి సన్మానం

నవతెలంగాణ-జైనూర్

తెలంగాణ రాష్ట్రంలో కళాకారులకు ప్రత్యేక సన్మాన సభలో సిర్పూర్(యు) మండలానికి చెందిన కనక సుదర్శన్‌కు శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో ప్రశంసపత్రం అందించి ఘనంగా సన్మానించారు. గిరిజన ప్రాంతం నుండి గుస్సాడీ కళాకారుడిగా హైదరాబాద్‌లో ప్రశంసపత్రం అందించడం ఆనందంగా ఉందని సుదర్శన్ పేర్కొన్నారు.